724068901

కనులకగుపించు దృశ్యంబు కాంచి మీరు
సత్యమని ఎంచబోకుడి సంబరంబున
తెరను దాగిన సత్యంబు తెలిసికొనక
విశ్రమింపక నాతోడ వెడలిరండు.

విద్యార్థులారా!

ఈ ప్రపంచములో మానవుడు తలచునది ఒకటి ఫలించునది మరొకటి. మానవుడు తన జీవిత సైకతరంపైన నిర్మించుకునే స్వప్నాల పిచ్చుకగూళ్ళను నేలరాల్చే పెనుగాలులు వుండకపోవు. రేకలను విప్పిన లేతమొగ్గలను నేలరాల్చు గాలులు రాక మానవు. మానవ జీవితము ఒకవిధమైన మాలవంటిది. ఈ మాలకు ఒకవైపున జననము మరొకవైపున మరణము. ఈ రెండింటి మధ్య అనేక కలలు, కలతలు, కల్లోలములు, విశ్రాంతి యీవిధమైన పూలచేత కూర్చబడి వుంటుంటాయి. కాని యీ అన్నింటికి ఆధారమై వున్న దారమును ఏ మానవుడు గుర్తించటం లేదు. దారము లేక హారము కాదు. ఈ దారమును గుర్తించిన వ్యక్తి మాత్రమే మానవుడుగా రూపొందుతాడు. దానినే సూత్రమన్నారు. దానినే బ్రహ్మసూత్రమన్నారు. కనుక సర్వమానవుల యందు సమత్వమై ఒకవిధమైన శక్తిసామర్థ్యముల నందించే ప్రధానమైన దారము దివ్యత్వమైన ఆత్మతత్వము. ఆధ్యాత్మిక ఖనిజసంపత్తికి ఆలవాలమైన భారతదేశమందు అశాంతి అసత్యము స్వార్థము స్వప్రయోజనము అధర్మము యిత్యాది పైశాచిక ప్రవృత్తులు విజృంభించి ప్రళయతాండవము సలుపుతున్నాయి. ఇట్టి తరుణమున సమాజములో శాంతి భద్రతలు నెలకొల్పుటకు విద్యార్థులే సమర్థులని విశ్వసించి విద్యాలయములు స్థాపించాము.

విద్యార్థులారా! ఎవరిని మీరు పౌరులని, పెద్దలని, గౌరవనీయులని, అధికారులని భావించుచున్నారో వారందరు పూర్వము విద్యార్థులే అనే సత్యాన్ని మీరు మరువరాదు. ఈ నాటి విద్యార్థులే భవిష్యత్తులో పెద్దలు, పౌరులు, అధికారులు, గౌరవనీయులుగా రూపొందుతారు. కనుక భవిష్యత్తును దృష్టియందుంచుకొని యీనాటి వర్తమానములో పలపెద్దల స్థితిగతులను ఏరీతిగా మీరు వర్ణిస్తూ, నిందిస్తూ వున్నారో దానిని లక్ష్యమునందు వుంచుకొని భవిష్యత్తులో మీరు కూడను మీ జీవితములను తీర్చిదిద్దుకొనుటకు తగిన కృషి చేయాలి. విద్యార్థి యొక్క జీవితము చాలా విలువైనది. జాతి పౌరసత్వమనే సౌధమునకు పునాదుల వంటిది. జీవిత సౌధమనే దానిలోపల సరియైన స్థితిగతులను విచారించటానికి తగిన అవకాశమిచ్చేది ఈ విద్యార్థిదశ. మానవుని సంస్కరింప జేసే సమాధానమైన తత్వాన్ని యీనాడు విచారించవలసిన విషయము. జీవితము యొక్క స్థితిగతులను చక్కగా విచారించి దానికి తగిన వివేక విజ్ఞానములను

724068902

సంపాదించుకొని తద్వారా ఆదర్శవంతమైన జీవితాన్ని అందించవలసినది విద్యార్థి జీవితమే సమాజమును చక్కబరచవలెనన్న (సమాజమంటే మట్టికాదు, భూమికాదు. మానవుల సమూహమే) మానవకోటి మధ్య ప్రేమ బీజములు నాటి సహన ప్రసూనములు వికసింపజేసి శాంతి పుష్పములు సమాజమున కందింపజేసే స్థితియే విద్యార్థి గతి.

సంసారమనగా యేదో ఒక పరిశ్రమ కానేరదు. మానవుని యందున్న దుర్బుద్ధులను వేరుచేసి సద్భావములను, సదాచారములను అభివృద్ధి పరచుకోటమే. దురదృష్టవశాత్తూ యీనాడు ప్రజలను సంస్కరింపజేసే అధికారము ప్రభుత్వమునకు గాని లేక ప్రభుత్వమును సంస్కరింపజేసే శక్తిసామర్థ్యములు ప్రజలకుగాని లేకపోవటం చేత యిన్ని దురవస్థలకు గురికావలసి వచ్చింది. దీనికి కారణమేమిటి? బాల్యమునందే మన భవిష్యత్తునకు అనుగుణమైన జీవితాన్ని సరైన రీతిగా మార్చుకోలేక పోవటమే. లేతవయస్సునందు మన భవిష్యత్తు జీవితమునకు తగిన భద్రతలను మనము యీనాడు పురికొల్పవలసి వస్తుంది. భావి పౌరులుగా కావలసిన విద్యార్థులు యీనాడు తగిన వినయ విధేయతలను పెంచుకోవలసి వస్తుంది. మానవత్వమంటే యేమిటో యీనాటి విద్యార్థులకు అర్థం కావటం లేదు. డిగ్రీల నిమిత్తమై ఎంత శ్రమ పడి కష్టపడి సాధించటానికి ప్రయత్నిస్తున్నామో దీనికంటె ఎన్నోరెట్లు మీరు నీతినియమాలను పోషించుకొని శ్రమపడవలసి వస్తుంది. నీతి, నిజాయతీ లేకుండా మానవత్వము రాణించదు దీనికి నైతిక ఆధ్యాత్మికములు అత్యవసరమైనవి.

విద్యార్థులారా! విద్యా విషయమునందుగాని, వైజ్ఞానిక విషయమునందు గాని మీరు వెనుకబడినప్పుడు మీ తల్లితండ్రులు ఎంత బాధకు గురౌతారో దానికంటె వేయింతలు నైతిక ఆధ్యాత్మిక విషయములందు వెనుకబడిన పిల్లలను చూచి సాయిమాత అంత బాధ పడుతుంది. మానవ జీవితమునకు నైతిక, ఆధ్యాత్మికములే నేత్రములుగా మీరు భావించాలి. ఈనాడు లౌకిక విద్యలుగాని, భౌతిక విద్యలుగాని మితిమీరి పెరుగుతున్నవి. అవి కూడను అవసరమే. కానీ మానవ జీవితము లోపల వుండవలసిన ప్రధాన గుణములు యీనాడు మనం విచారించటం లేదు. భౌతికంగా లౌకికంగా యీనాడు మానవజాతి యెంతయో అభివృద్ధి పొందినప్పటికి నైతికంగా కాని, నీతి నిజాయతీలందు గాని అభివృద్ధి గావించుకునేదానికి తగిన కృషి చేయలేక పోతున్నది. దీనికి కారణమేమిటి? తరతరములనుండి మానవుని యందు పాతుకొనిపోయిన స్వార్థము, స్వప్రయోజనమే దీనికి కారణము. ఏది చదివినా, ఏది చెప్పినా, ఏది విన్నా, ఏది చేసినా, ఏది చూచినా ఆ అన్నింటికి వెనుక స్వార్థము, స్వప్రయోజనము కదులుతూనే వున్నది. స్వార్థము లేక మానవుడు ఒక అడుగైనా ముందుకు నడవటానికి ప్రయత్నించటం లేదు. కేవలము స్వార్థము స్వార్థము. స్వార్థనిమిత్తమే మనము జీవిస్తున్నామంటే సమాజము యొక్క గతి ఏమిటి? సమాజము లేక నీవెక్కడున్నావు? నీవు సమాజములో ఒక వ్యక్తి. ఈ వ్యక్తిత్వమునే దాని

యొక్క శక్తిని సమాజమునకు పంచవలసిన బాధ్యత నీకున్నది. నీ సుఖము, నీ శాంతి, నీ అనుకూలము, నీ ఆనందము సంఘము ద్వారానే నీవందుకోగలుగుతున్నావు. నీవేనాడు పుచ్చుకొనుటకు సిద్ధముగా వున్నావుగాని నీ సేవను యిచ్చుకొనుటకు యేమాత్రము సిద్ధముగా లేకపోతున్నావు. మానవ జీవితము యిచ్చుకోటం పుచ్చుకోటం సంబంధబాంధవ్యములతో కూడిన తత్త్వమనే దాన్ని మీరు గుర్తించాలి. ఏ తల్లిదండ్రుల ద్వారా నీ వింతటి అభివృద్ధికి గురైతివో ఏ బంధుమిత్రుల ద్వారా ఈ సమాజములో ఏవిధమైన ఆనందమును నీవు అందుకోగలిగితివో, ఏ గురువులచేత యీస్థాయికి నిల్చగలిగితివో వీటన్నిటిని మనసునందుంచుకొని తగిన కృతజ్ఞతను అందించటమే నీ ప్రధానమైన కర్తవ్యము. కానీ యీనాటి విద్యార్థులకు కృతజ్ఞత అంటే యేమిటో తెలియక పోతున్నది.

మానవుని ఆనందానందములను కూడను యీనాటి విద్యార్థులు గుర్తించుకోలేక పోతున్నారు. ఆనందమనేది అందమైన పదార్థములయందు మాత్రం గుర్తించెదము. పదార్థములయందు ఆనందము యిమిడి వుండదు. బయటి ప్రపంచములో ఆనందమనేది మనకు లభ్యము కాదు. ఆనందము నీయందే యిమిడి వున్నది. ఆనందము నీయందే కూడి వుండుచున్నది. ఇది నీ భావోద్రేకముల చేత కలిగే ప్రతిబింబములే. ఒక మెత్తని వత్తివలె కనుపించే పక్షిని చూచి కవి దానిని అనేక రకములుగా వర్ణిస్తాడు. కాని అదే పక్షిని చూచి హంతకుడు దాని మాంసపు రుచిని మాత్రమే వర్ణిస్తాడు. మానవుల అభిరుచులు వేరువేరుగా వుండుటము చేతనే అందము కూడను వేరువేరుగా వుంటుంటాది. పతికి దూరమైన సీతాసతి అశోకవనములో ఏకాంతముగా వుంటున్నది. అశోకవనములో యనేక విధములైన ఆకర్షణీయమైన అందమైన వస్తువులంతా రావణుడు నిర్మించాడు. ఆ అశోకవనములోని వస్తువులు ప్రపంచములో ఎక్కడా లేవని చెప్పవచ్చును. అంతటి ఆకర్షణీయమైన అందమైన విచిత్రమైన వస్తువులుండినప్పటికిని సీతకు ఆనందాన్ని అందించలేకపోయినవి. కనుక పదార్థముల ద్వారా మనకు ఆనందము లభ్యమవుతున్నదా? యిది కేవలము కల్ల. కొంతసేపటికి అశోకవృక్షము పైకి ఆకుల మరుగున కూర్చున్న ఒక కోతి గానమును ప్రారంభించినది. ఆగానం వినబడిన తక్షణమే ఏనాడు తలెత్తి చూడని సీతాదేవి అవృక్షముపైన చూచింది. ఈ కోతి ఆమెకు చాలా అందంగా కనుపించింది. అశోకవనములో అందమైన వస్తువులు యెన్నియో వుండగా ఆనందించక ఆకోతిలో ఆనందించటములో వున్న అంతరార్థమేమిటి? ఆమెకు ఆనందము నందించే రామకథను పాడటం చేతనే ఆమెకు అందంగా కనుపించింది. తిరిగి సీతకొక సందేహం ప్రారంభమైంది. దుష్టుడు, దుర్మార్గుడైన రావణుడు యీవేషములో వచ్చి నన్నాకర్షించటానికి పూనుకుంటున్నాడో ఏమో అనే సందేహం కలిగింది. హనుమంతుని నోటినుండి పవిత్రమైన మాటలు వెలువడుతూ వచ్చాయి.

724068904

శ్రీమద్రవికులమందు జనించి సీతాదేవిని ప్రీతి వరించి
ప్రేమ నహల్యా శాపము దీర్చి ప్రియ భక్తుల రక్షించిన శ్రీరఘు
రామ రామ రామ సీతా, రామ రామ రామ సీత
ఖర దూషణులను దనుజుల ద్రుంచి కరుణా జటాయువు గతి సవరించి
శరభంగాది మునీంద్రుల బ్రోచి శబరీ ఫలములు ప్రేమ భుజించిన
రామ రామ రామ సీతా రామ రామ రామ సీత
ముందుగ హనుమంతుని దీవించి, ముదమలరగ రవిసుతు పాలించి
చెండిన కినుకతో వాలిని ద్రుంచి, చేరిన వానర వీరుల బ్రోచిన
రామ రామ రామ సీత రామ రామ రామ సీత.

పూర్వము యీ హనుమంతుడెవరో యీ సీతకు తెలియదు. సీత అశోక వనమునకు వెళ్లాకనే రామునికి హనుమంతునితో స్నేహం ప్రారంభమైంది. కనుకనే రామునకు హనుమంతునకు కలిగిన సంబంధ బాంధవ్యముల గురించి చక్కగా గానం చేస్తూ వచ్చాడు యీ హనుమంతుడు. అనగా తానెవరో తనకు రామునకు వుండిన సన్నిహిత సంబంధ బాంధవ్య మేమిటో అనే విషయాన్ని చక్కగా ఒక విజిటింగ్ కార్డు మాదిరి సీతకందిస్తూ వచ్చాడు. ఈ విషయమునంతా విన్న సీతకు ఎక్కడ లేని ఆనందము పుట్టిపడింది. దీనిని బట్టి మానవునికి ఆనందమనేది అందమైన పదార్థముల యందు కాని అందమైన విషయములందుగాని అందమైన వ్యక్తుల యందుగాని లభించదని తేలింది. మానవుని యిష్టమునందే ఆనందం ఆవిర్భవిస్తుంది. కానీ యిష్టము లేని దానిపైన ఆనందము యేమాత్రము ఆవిర్భవించదు. అందము ఆనందము నందిస్తుంది. కనుకనే 'అందమే ఆనందం ఆనందమే జీవిత మకరందం' అన్నారు. ఈనాడు ఆనందము కోరే మానవునికి కావలసినది యేమిటి? అందములు కావు. ఆనందమనేది తనయందే యిమిడి వుంటున్నది. తనయందున్న ఆనందాన్ని ఆవిర్భవింపజేసుకోటానికి అంతర్దృష్టిని అభివృద్ధి పరచుకోవాలి.

విద్యార్థులారా! నిరంతరము మనం బహిర్దృష్టిని మాత్రమే బలపరచుకుంటూ పోతున్నాము. ఏ ఆనందముగాని సుఖముగాని, సంతోషముగాని మననుండియే వెలువడుతున్నది కాని బయటనుండి మనలో ప్రవేశించటం లేదు. మనము చూచుచున్న ప్రతి దృశ్యము మనలోనున్న ప్రతిబింబములే. Reflection of inner being. దీని తత్వాన్ని గుర్తించుకోటానికి మన లోపల పవిత్ర భావాలను అభివృద్ధి పరచుకోవాలి. పశ్యతీతి ఋషిః అన్నారు. ఇంతటి దృష్టి కలిగినది పశువు. మనం అంతర్దృష్టిని అభివృద్ధి గావించుకోవాలి. మానవుని యందు ఒక విధమైన దివ్యశక్తి యిమిడి వుంది. ఆ యిమిడి వున్న దివ్యశక్తిని మనము వెలుపలకు తీసుకోవాలి. ఒక చిన్న ఉదాహరణము. ఈ నాడు బి.ఎ., ఎం.ఎ., బి.కామ్., ఎం.కామ్. చదివి యింత వున్నతస్థితికి వచ్చారు. ఇవన్నీ కూడను గ్రంథమూలకముగా పరిచయమైనవే గాని అన్ని

724068905

మనయందే వుంటున్నవి. తనయందు ఆదివ్యశక్తియే లేకపోయినప్పుడు ఈ గ్రంథముల ను యేరీతిగా మనం పఠించగలం? ఆదివ్య శక్తియే ఈ గ్రంథములను పఠింపచేస్తూ వచ్చింది. ఆ దివ్య శక్తిని మనం యీనాడు పోషించుకోవాలి. స్వార్థపరులు దీనిని తమ నిమిత్తము తమ కుటుంబ నిమిత్తము తమ స్వప్రయోజన నిమిత్తము ఉపయోగపె ట్టుకొని అనర్థంగావిస్తున్నారు. లోక కళ్యాణము నిమిత్తమై మీరు దీన్ని అనుభవించాలి. 'సర్వలోక హితే రతః'. లోక హితాన్ని మాత్రము కోరి యీ శక్తిని మనము వినియోగపెట్టాలి. సర్వ జ్ఞానోప సంపన్నః' ఈ విధమైన జ్ఞానమును సర్వమును అనుభవించి జగత్తుకే విని పించి తద్వారా వినియోగ పరచుకోవాలి. 'సద్గుణములు పోషించుకునే నిమిత్తమై మ నము యీ శక్తిని అభివృద్ధి చేసుకోవాలి. సద్గుణములే లేకపోతే యీ చదువులన్నీ వ్యర్థము. సద్గుణములే యీ చదువునకు ప్రధానము. ఈ గుణములు పోషించుకొనే నిమిత్తమై సంస్కారములు అత్యవసరము. ఈ సంస్కారము నిమిత్తమే ఆధ్యాత్మికంలో ప్రవేశించాలి. నైతిక విలువలు పెంచుకోవాలి. నైతిక విలువలే లేకపోతే పశుజీవితాన్ని గడిపిన వారమవుతాము. ఎంతధనమువుండి యేమి ప్రయోజనము? ఎంత ధనమున్న, ఎంత బలమున్న ఏమి ప్రయోజనము? ఇది గౌరవనీయమని లోకము భావించవచ్చునేతప్ప ఎవ్వరూ నిన్ను ప్రేమించలేరు. మనలను అందరు ప్రేమించే రీతిగా సద్గుణాలను పో షించుకోవాలి. గౌరవము కంటె ప్రేమ చాలా ప్రధానమైనది. గౌరవం లోక సంబంధమైన మర్యాద. ప్రేమ హృదయ సంబంధమైనది.

విద్యార్థులారా! మీరు పేరుప్రతిష్ఠలకై పాకులాడకుండా ప్రజలప్రేమను మాత్రమే అందుకొనే నిమిత్తమై జీవితాన్ని గడపండి. ఈ గౌరవములన్నీ కృత్రిమములైన వే. ముందువచ్చినపుడు నమస్కారమనవచ్చును. వెనుకకు పోయి వానిని దూషించవ చ్చు. ఇది కాదు మనము సంపాదించవలసినది. సత్ప్రవర్తనము చేతనే ప్రేమ మనకు ప్రాప్తించుతుంది. మంచినడతలు అభివృద్ధి పరచుకోవాలి. నడతల్లో లేనిది మన కు గ్రంథములలో లభించదు. వినయ విధేయతలు విద్యకు అత్యవసరమైనవి. గొప్ప చదువు చదివితినని గర్వించుకుంటే నీగర్వము అధఃపతనము గావిస్తుంది. వైద్యునకు నయముగాని రోగము మానవునియందు అహంకారమే. ఈ అహంకారమనే రోగము మనలో ప్రవేశిస్తే యేమాత్రము అభివృద్ధికి రాలేము.

విద్యార్థులారా! అన్నియు తెలిసినప్పటికిని తెలియనివాని వలె మనం నటించాలి. అనేక పర్యాయములు చెప్పాను. భగవత్త్వమునకును మానవత్వమునకును వుండిన వ్యత్యాసమిదియే. సర్వము తెలిసినప్పటికిని భగవంతుడు ఏమీ తెలియనివాడుగా వుంటాడు. ఏమీ తెలియకపోయినా మానవుడు అన్నీ తెలిసిన వాడుగా విఱ్ఱవీగుతాడు. అన్నీ వుండియు ఏమీ లేనివానివలె కనుపిస్తాడు భగవంతుడు. ఏమీ లేనప్పటికిని అన్నీ వు న్నవానివలె నటిస్తాడు యీ మానవుడు. ఈ ఆడంబరమునకు అలవాటు పడటం చేతనే

724068906

మానవత్వము దిన దినమునకు దిగజారి పోతుందాది. ఈ ఆడంబరము మనకు పనికిరాదు. మనకు ఆచరణ అత్యవసరము. ఆకారమానవుని చేత లోకానికి యేమాత్రము ఫలము లభించదు. ఆచార విచారములు కలిగి వుంటుండాలి. ప్రతి ఒక్క విషయమును మనము ఆచరణలో పెట్టాలి. అప్పుడే మన మానవత్వము దివ్యత్వంగా మారిపోతుంది.

దేవుడనగ వేరు దేశమందున లేడు
దేవుడలరు తనదు దేహమందె
పాపమనగ వేరు పరదేశమున లేదు
తాను చేయు పనుల తగిలియుండు.

కనుక పాపము పుణ్యము పరదేశమునుంచి మనకు వస్తున్నావు. లేక మన friends gift యిచ్చారు. మరే షాపులోను కొనుక్కోటానికి సాధ్యంకాదు. మంచిగాని చెడ్డగాని, దుఃఖముగాని, ఆనందముగాని మనం చేసే పనులనుంచే ఆవిర్భవిస్తున్నాయి. కనుకనే నీవు మంచిని చేసి మంచిని చూచి మంచిగా వుండి మంచిగా జీవించు. ఈ ఆనందమనేది మనకు మంచిపనుల ద్వారానే లభ్యమౌతుంది. ఇదియే భగవంతుని దగ్గరకు సరియైన మార్గము, రాజబాట. జనసేవ చెయ్యాలి. నీకు నీవు ప్రశ్న వేసుకోవచ్చు What is the way to God. అనే ప్రశ్న వేసుకుంటే The best way to Love God is to serve all. యిదే జవాబు. కానీ యీనాడు యింత విశాలమైన ప్రేమగాని యింత విశాలమైన సేవగాని ఏ మానవునియందు కానరావటం లేదు. మన సంస్థ విద్యార్థులైనా దీనికి కొంతవరకు తోడ్పడి చేదోడు వాదోడుగా వుంటారని ఆశచేతనే యీ Institute స్థాపించాము.

విద్యార్థులారా విద్యావిషయములో మీకెంత శ్రద్ధాభక్తులు కలవో అంతకంటె అధికముగా దైవ విషయమునందు శ్రద్ధాభక్తులు పోషించుకొండి. ఈనాడు ప్రపంచములో ఎంతమంది విద్వాంసులుంటున్నారు. ఎంతోమంది మేధావులుంటున్నారు. తెలివి తేటలు గలిగిన వారెందరో వుంటున్నారు. కానీ దేశమునకు శాంతి భద్రతలు యివ్వలేక పోతున్నారు. కారణమేమిటి? ఈ మేధాశక్తులు, ఈ విద్యాశక్తులు ఈ తెలివితేటలు తమకు తాము అభివృద్ధి గావించుకొనుటకై వుపయోగపెడుతున్నారే గాని 'లోకాస్సమస్తా సుఖినో భవంతు' అనే విశాల హృదయం లేకపోవటమే కారణం. తన శరీర మానసిక బుద్ధి శక్తులు తన నిమిత్తమై యేవిధంగా వుపయోగపెడుతున్నాడో సమాజ నిమిత్తము కూడను ఈ శరీరమనో బుద్ధి శక్తులను ఉపయోగపెట్టాలి. భారత దేశమందే కాక యితర దేశములయందు కూడను గొప్పగొప్ప విద్యావంతులున్నారు. కానీ వారంతా కేవలము విద్యావంతులుగా రూపొందుతున్నారే గాని జ్ఞానులని చెప్పటానికి సాధ్యము కాదు.

జ్ఞానికి విద్యావంతునికి వున్న వ్యత్యాసమేమిటో మీకు చెప్తాను.

724068907

రాముడు 34 విద్యలు చదువుకున్నాడు. రావణుడు 64 విద్యలు చదివాడు. కాని రావణుడు మూర్ఖుడు అన్నాడు వాల్మీకి. 'రావణో నామ మూర్ఖోऽసౌ' అన్నాడు. రావణుడు మూర్ఖుడు. రాముడు జ్ఞాని అన్నాడు. అతను జ్ఞాని కావటానికి యితను మూర్ఖుడు కావటానికి ఏం చదువులో తక్కువనా. ఇన్ని చదువులు చదివిన రావణాసురుడు ఇంద్రియాలకు వశమైపోయాడు. కనుకనే మూర్ఖుడైపోయాడు. రాముడు యింద్రియాలను నిగ్రహించాడు. అందువల్లనే జ్ఞాని అయ్యాడు. కేవలము మేధాశక్తి కలిగినవాడు కాదు జ్ఞాని. ఇంద్రియనిగ్రహము కలిగినవాడే జ్ఞాని. హిరణ్యకశిపుడు ఎన్నిరకములుగానో విద్యార్థియైన ప్రహ్లాదునికి బోధించాడు హిరణ్యకశిపుడు చదివినంత చదువు అతనికి వున్న శక్తిసామర్థ్యములు మరొకనికి లేవు. ఈనాడు సైంటిస్టులంతా ఏయే పరిశోధనలు చేశారో దానికంటె నూరింతలు అధికంగానే పరిశోధనలు చేసినవాడు హిరణ్యకశిపుడు. జలములో ప్రవేశించి పరిశోధనలు చేశాడు. సమస్త శక్తులు హస్తగతం గావించుకున్నాడు. పంచభూతములను తన హస్తములో పెట్టుకొని ఆటలాడుకున్నాడు. ఇన్ని తెలిసిన హిరణ్యకశిపుడు తన యింద్రియాలకు లొంగిపోయాడు. బైట శక్తులు ఎన్ని సాధించి ప్రయోజనమేమిటి? చంద్రమండలము, సూర్యమండలము, మిల్కీవే అదియివి ఎన్నో వేస్ మీరు చూస్తున్నారు. తనయందున్న మూర్ఖత్వాన్ని తాను పోగొట్టుకోలేకపోతున్నాడు. తనయందున్న బలహీనతను తాను సాధించలేకపోతున్నాడు.

ఎన్ని విద్యలు నేర్చి ఏమి ఫలము
తన నొసటి వ్రాత తప్పించ నెవరి తరము
చెడ్డ భావము తన తల చేరెనేని
ఎండ బారును బుద్ధులు బెండు బారు.

మన తలలోపల చెడ్డ భావములు రాకుండా చూచుకోవాలి. అవి మనలో వచ్చినప్పుడు ఎంత చదువు చదివి కూడను వాడు వ్యర్థమైన వాడే.

Knowledge అనునది మనలో వుండినప్పుడు మనము ఆచరణలో పెట్టాలి. Knowledge without action is useless. అన్నారు. Action without Knowledge is foolish అన్నారు. మన మీనాడు foolish అయిపోతున్నాము. Knowledge వుంటుండాది. కాని action లేదు. action వుంటుండాది Knowledge లేదు. ఈ రెండిటికి పొత్తు కుదరాలి. అందువల్లనే చిన్న పిల్లవాడైన ప్రహ్లాదుడు తండ్రికి బుద్ధి చెబుతూ 'లోకములన్నియున్ గడియలోన జయించినవాడవు తండ్రి, యింద్రియానీకము చిత్తమున్ గెలువ నేరవు' అన్నాడు. ఏమిటి నీవు సాధించింది? ప్రపంచాన్నంతా సాధించానని అనుకుంటున్నావు. నీలో వుండిన యింద్రియాలనే నీవు సాధించలేకపోతున్నావు. ఇది కాదు. లోకాన్ని సాధిస్తే నీవు రాజువు కావచ్చు. నీ ఇంద్రియాలను నీవు సాధిస్తే మహారాజు కావచ్చు. రాజులకు రాజు మహారాజ రాజా

నీయింద్రియములే నీశత్రువులు. 'లోని శత్రువులకు లొంగిపోయినవాడు, బయటరిపుల నెట్లు పట్టగలడు'.

మనము లోని శత్రువులకే లొంగిపోతున్నాము. బయటి శత్రువులను యేమాత్రం పట్టలేము. మొట్టమొదట లోని శత్రువులను మనం నెట్టివేయాలి. దీనికి తగిన మార్గము ఆధ్యాత్మిక మార్గమొక్కటే. ఆధ్యాత్మిక మార్గములో మనము సులభముగా యింద్రియాలను జయించవచ్చు. ఇంద్రియములను సాధించలేని విద్యలు ప్రయోజనంలేని విద్యలే. కేవలము పొట్టకూటి నిమిత్తమై మనము పాటుపడుతున్నాము. కృషి కూటి కోసం. విద్య విజ్ఞానం కోసం. విద్య కూటి కోసం కారాదు. కానీ యీనాటి education అంతా పొట్టకూటి కోసమే.

బానెడు పొట్ట నింపుకొన చిక్కుల నొందుచు కోటి విద్యలన్
పూనిక మీద నేర్చి పరిపూర్ణ సుఖంబుల పొందలేక యీ
మానవ జాతి దుఃఖముల మ్రగ్గగ నేటికి శ్రీపరాత్పరున్
ధ్యానము చేయు భక్తులకు దారిని చూపక యున్నె మానవా.

పుస్తకముల్ పఠించితిని, పూర్తిగ జూచితి సర్వశాస్త్రముల్
నిస్తులమైన విద్యలను నేర్చితి నంచును గర్వమేల నీ
హస్తయుగంబు మోడ్చి పరమాత్ముని భక్తి భజింపవేని యీ
ప్రస్తుత విద్యలన్నియును భ్రాంతి నిరర్థకముల్ గద ధాత్రి మానవా

నిద్దుర నుండి లేచి మరి నిద్దుర పోయెడుదాక పొట్టకై
హద్దును పద్దును లేక క్షయమందగ జేయుచు జీవితంబు నీ
విద్దెల ధారపోసి యరవింద దళాక్షుని విస్మరించి యే
పెద్ద సుఖంబు నొందితివో ప్రీతిగ యోచన చేయు మానవా!

తెల్లవారి మొదలు రాత్రి పరుండునంత వరకు మధ్య మధ్య పానీయం సమర్పయామి. పొట్ట నిమిత్తమై ఎంతో మనం ప్రాకులాడుతున్నాము. కాని మనము సాధించినది ఏమిటి? మనము ఏ పొట్టనిమిత్తమై ప్రాకులాడుతున్నామో పశు, పక్షి, మృగాదులు కూడను అదే విధముగానే ప్రాకులాడుతున్నాయి. అవే యిరకాటములు. ఇంక ప్రత్యేకంగా విద్యనేర్చి ప్రయోజనమేమిటి? ఆ మృగములు యే యూనివర్సిటీకి పోయినాయి? ఏ డిగ్రీలు తీసుకున్నాయి? ఏ విదేశాలకు వెళ్లుతున్నాయి. ఇవన్నీయేమి చేయటం లేదు. కానీ మానవుడనే వానికి ప్రత్యేకమైన విజ్ఞాన ప్రజ్ఞాన సుజ్ఞానములను పోషించుకునే నిమిత్తమై విద్య అవసరము. ఇవన్నియూ నేర్చి విచక్షణా జ్ఞానాన్ని పూనాలి. ఈ discrimination లోపల కూడను సక్రమమైన వివేకముతో discrimination కావాలి. ఈనాడు discrimination power చాలా ఎక్కువగానే వుంటున్నది. ఈ విజ్ఞానము బాగా పెరిగిపోతుందాది. కాని వివేకము శూన్యమైపోతూ వస్తుందాది. విజ్ఞానమునకు తగిన వివేకము కూడా వుండినప్పుడే విజ్ఞానాన్ని సద్వినియో

724068909

గము చేయవచ్చు. వివేకము లేకపోతే విజ్ఞానము నిరర్థకము. ఇదియె రీతిగా వుపయోగపెట్టాలి. అనేక రకములుగా వుపయోగపెడుతూ గొప్పగొప్ప బాంబులన్నీ తయారు చేస్తున్నారు. అటంబాంబులని, న్యూక్లియర్ బాంబులని యింకా ఏమేమో తయారు చేస్తున్నారు. ఇవన్నీ తయారుచేసి మనము ఏమి చేయగలుగుతున్నాము? ఒక్కక్షణము లోపల దేశములంతా భస్మము గావిస్తున్నాము. ఇది వివేకము లేని విజ్ఞానము. అదే వివేకముతో యీ విజ్ఞానాన్ని పోషించుకున్నప్పుడు ఆ అణుశక్తినంత కూడను అభివృద్ధి పరచి దేశము లోపల అనేక విధములైన ఉత్పత్తులను అభివృద్ధి గావించవచ్చు. తిండి కావాలి. పదార్థాలు కావాలి. ప్రజలకు వుపయోగపడే అనుకూలములు ఎన్నో మనం చేసుకోవచ్చు కదా! కోడు కాటుకకైనా చేస్తుంది వేలు మహేశుడైనా చేయలేడు బాంబులువేసి చంపటమా గొప్పతనము? ఒక్క మనిషినైనా బ్రతికించటానికి ప్రయత్నించేది ఇది వివేకముతో కూడిన విజ్ఞానము.

విద్యార్థులారా! మీ సైన్సు, మీ విజ్ఞానము ఎంతవరకైనా అభివృద్ధి చేసుకోవచ్చు. తప్పుకాదు. అన్నింటిని తెలుసుకో. అదే ఎవేర్‌నెస్ ఆఫ్ లైఫ్. తెలుసుకోటంలో తప్పులేదు. కానీ తెలుసుకున్న దానిని యేది నిత్యము యేది అనిత్యము ఏది సత్యము ఏది అసత్యము అని విచారణ చేసి సత్యాన్ని నీవు ఆచరించు. ఒక చిన్న ఉదాహరణము. చూడండి. ఈ విద్య వల్ల యేర్పడిన సంకుచితత్వము. ఈనాటి విద్యార్థులు సంకుచితమైన స్థితిలో అభివృద్ధి గాంచుతున్నారు. ఇక్కడ రెండు రకములైన కుటుంబాలుంటున్నాయి. న్యూక్లియస్ కుటుంబమని ఒకటి సమూహమనే కుటుంబము ఒకటి వుంటున్నాయి. ఈ న్యూక్లియస్ కుటుంబములో అమ్మనాన్న బిడ్డ కొడుకు అంతే. ఈ న్యూక్లియస్ కుటుంబము చాలా [illegible]. సామూహిక కుటుంబము తల్లి, తండ్రి, బిడ్డ, కొడుకు, తాత, అవ్వ, ముత్తాత వీరందరు చేరినటువంటిది. ఈనాడు ఏమైపోయింది న్యూక్లియస్ కుటుంబములోపల అమ్మనాన్నలు ఆఫీసుకు పోతారు. బిడ్డలను ఆయా దగ్గరనో, డ్రైవరు దగ్గరనో, ప్యూన్ దగ్గరనో విడిచిపెడతారు. ఈ పిల్లలకంతా ఆయా బుద్ధులు, డ్రైవరు బుద్ధులు, ప్యూన్ బుద్ధులు వస్తుంటాయి. వీళ్లు దమ్మిడీకి పనికిరాకుండా పోతున్నారు. ఏదో డబ్బులిచ్చేసి చదివిస్తుంటారు. వాడు ఏం చేస్తున్నాడు ఎక్కడకు పోతున్నాడు ఎట్లా పెరుగుతున్నాడు అనే విచారం తల్లితండ్రులకే మాత్రం పట్టటం లేదు. ఈ సామూహిక కుటుంబములోపల ఎట్లా వుంటాదంటే అమ్మనాన్నలు ఆఫీసుకు పోయినాగాని అవ్వాతాతలు యింటిలో వుంటారు. ఈ తాతలు, అవ్వలు వాళ్లకు మంచినంతా బోధిస్తాయేవో కథలు చెప్తుతుంటూ సరైన అభివృద్ధికి తగిన ఉపదేశాలు చేస్తూ వుంటారు. ఒకవేళ అమ్మనాన్నలు పోట్లాడితే న్యూక్లియస్ కుటుంబములో వారికి దిక్కులేదు. ఎవరు చెప్పేవారు కూడ వుండరు. ఈ సామూహిక కుటుంబములో ఏమౌతుంది? వాళ్ల అత్త మామలు వుంటారు. లేక తల్లితండ్రులుంటారు. వాళ్లొస్తారు. ఏమిరా నాయనా యిట్లా చేస్తున్నావు యిది మంచిది కాదు యిట్లా చేయకూడదని బుద్ధులు చెప్తుంటారు. ఈనాడు joint family పతనమై పోయింది. తమ familyనే పతనం చేసుకుంటున్న వాళ్లు యింక ప్రపంచము యొక్క విశాలమైన బుద్ధి వారికెక్కడనుండి వస్తుంది.

724068910

తల్లి తండ్రులనే లెక్క చేయటం లేదు. ఇంత లోకాస్సమస్తా సుఖినో భవంతు కేవలం గాలి వార్తలు. మొట్టమొదట మనం న్యూక్లియస్ కుటుంబమును విశాలంచేయాలి. జాయింటు ఫ్యామిలీగా వుండాలి. ఈ జాయింటు ఫ్యామిలీ లోపల యెంతనో మనకు అభివృద్ధి వుంటుండేది. ఎంతనో ఉత్తమమైన మార్గాలున్నాయి. ఎంతనో వుత్తమమైన బుద్ధులు అభివృద్ధి అవుతాయి. ఈ joint family గౌరవ మర్యాదలకు పాటు పడుతూ వచ్చింది ఆనాడు. ఈనాటి న్యూక్లియర్ family యేమి ప్రయోజనం లేదు. కేవలం ఆడంబరాలు Twinkle Twinkle little star how I wonder what you are యిది మనం చూపిస్తుండేది. ఈ వేషాలచేత జగత్తునంతా మోసం చేస్తున్నారు. ఇది కాదు మనం నేర్చవలసినది. మన సమాజమును మనం చక్కబరచుకోవాలి. మన దేశాన్ని మనం చక్కబరచుకోవాలి. మన కుటుంబాన్ని మనం చక్కబరచుకోవాలి. ఎవరికి వారు వారి వారి కుటుంబాలను సమాజాన్ని చక్కబరచుకుంటే దేశమెంత సులభంగా చక్కబడుతుంది. ఈనాడు కుటుంబ విషయమై వీరికే మాత్రము బాధ్యత లేదు.

విద్యార్థులారా! మొట్టమొదట మీరు మీ కుటుంబాన్ని పోషించుకోండి. మీ కుటుంబాన్ని మీరు గౌరవంగా నిలబెట్టుకోండి. మొట్టమొదట మీ తల్లిదండ్రులను సంతృప్తి పరచండి. ఆశక్తియే మీలో లేనప్పుడు ఎన్ని విద్యలు చదివి యేమి ప్రయోజనం?

చదువులన్ని చదివి చాల వివేకియై
మగిడి తన్నెరుగడు మందమతుడు
ఎంత చదువు చదివి ఏ రీతి వున్నను
హీను డవగుణంబు మానలేడు.
తరచి చదువ చదువ తర్కవాదమెగాని
పూర్ణ జ్ఞానమెపుడు పొందలేడు
చదువు చదువు చదివి చావంగనేటికి
చావు లేని చదువు చదువ వలయు.

ఎంఏలు బియేలు ఏర్పడ జదివియు
పేరుగాంచిన పెద్దవారలైన
సంపదలుండియు సద్దాన పరులైన
పుడమి కీర్తినిగన్న పుణ్యులైన
ఆయురారోగ్యంబు లనవరతముండి
పరిపూర్ణబలులగు వారలైన
సతతమ్ము జపములు తపములు చేయుచు
వేదమ్ములన్నట్టి విప్రులైన
సాటి రారు భక్తులకు ఏనాటికైన.

724068911

దైవభక్తియే లేకపోతే యివన్నీ నిష్ప్రయోజనం. పిల్లవాడు అన్నిట అందంగానే వున్నాడు. కనులు చూస్తే చుక్కలవలె వుంటున్నాయి. ముక్కు చూస్తే రత్నంగా కనుపిస్తున్నది. కాళ్లు చేతులు చూస్తుంటే చక్కగా వుంటున్నాయి. అన్ని అంగాలకు తగిన కొలతలుంటా వున్నాయి. కేవలము ప్రాణము ఒకటి లేదు. అలాంటిదే మన యీనాటి చదువులు. అన్ని వుంటున్నాయి. ఎమ్ఏలు పాస్ చేశాము. ఎంబిఏలు పాస్ చేశాము. పి.హెచ్.డిలు పాస్ చేశాము. అంతా పాస్ చేశాము. గుణం లేకపోతే ఏమి ప్రయోజనం. గుణములు మనం పోషించుకోవాలి. ఆ గుణములే లేకపోతే ఏమి ప్రయోజనం లేదు. చెవిటి వానికి సంగీతశాస్త్రమేల? చెవిటివానికి ఎంత సంగీతం చెప్పి ఏమి ప్రయోజనం? ఆ విధంగానే మన శాస్త్రములు, మన ఉపనిషత్తులు గుణములేనప్పుడు ఎన్ని చదివినప్పటికి గొప్ప పండితుడని పేరుపెట్టుకున్నప్పటికిని ప్రయోజనం లేదు.

విద్యార్థులారా. ఎన్ని చదువులైనా చదువుకోండి. భగవద్విశ్వాసము మాత్రం పెట్టుకోండి. ఆ విశ్వాసం లేక మనిషే కాదు. Truth అనేదే God. Love అనేదే God. కనుక యీ truth ను మీరు సరైన మార్గములో అనుసరించండి. మీ చదువులయందు ఎంత వృత్తిర్లైనప్పటికి ఎంత గొప్ప గొప్ప పేరుప్రతిష్టలు సంపాయించుకున్నప్పటికి హృదయసంబంధమైన నైతిక విలువలు మాత్రం పోగొట్టుకోకూడదు. కనుక భగవన్నామ స్మరణ చేత సాధ్యమైనంత వరకు పరోపకార సంబంధమైన సేవలలో పాల్గొనాలి. ఏదో ఒక విధమైన విద్యావిషయాలు లోపల మనసునంతా వ్యర్థం చేయగూడదు. ఈనాడు విద్యలు పెరుగుతూ పెరుగుతూ పోయే కొద్దీ మనలో వుండిన సహజమైన శక్తి సామర్థ్యములు కోల్పోతున్నాము. పూర్వకాలము వీధిబడులలో కూర్చుంటే రెండు ఒకట్ల రెండు, రెండు రెళ్లు నాలుగు యీలా చదువుతుంటే బజారులో పోయేవారూ నేర్చుకునేవారు. ఇప్పుడు ఆడవారు కాని మగవారు కాని ఒక షాపుకు పోయి ఒక చీర, బనీను, పంచె, షర్టు కొనుక్కుని వెల ఎంత అంటే Calculator నొక్కుతూ కూర్చుంటారు. వీరి బుద్ధి ఎక్కడకు పోయింది. భగవంతుడిచ్చిన తెలివితేటలు నాశనము చేసుకుంటున్నారు. ఈ science లో develop అయిన కృత్రిమమైన యంత్రాలంతా వుపయోగపెడుతున్నారు. నాలుగు వత్తవలసిన చోట మూడు వత్తితే మొత్తము తప్పిపోతుంది. కనుక మొట్టమొదట నీ స్వశక్తిని నీవు పోషించుకో. నీ తలలో వుండిన శక్తిని నీవు చక్కగా జ్ఞాపకము వుంచుకో. నీ Calculator పైన, నీ computer పైన depend ఐ వుండవద్దు. ఇది మనం adjust చేసినట్లుగా నడుస్తూ పోతుందిగాని దానికి ప్రాణము వుండదు. దానికి ప్రాణం యిస్తున్నావుగానీ నీ ప్రాణం నీవు తీసుకుంటున్నావు. ఇదే యీనాటి చదువులలో వచ్చిన గొప్ప శక్తి. మన శక్తిపైన మనం ఆధారపడాలి. మన కాళ్లపైన మనం ఆధారపడాలి. యీ Calculator పైన యీ Computer పైన మనం ఆధారపడకూడదు. ఏదో అవసరం వచ్చినప్పుడు use చేసుకోవచ్చు. కానీ మొట్టమొదట తనపైన తాను నిలబడాలి. అదే Self confidence. ఈ Self confidence లేనివానికి computer confidence

724068912

ఎక్కడ నుండి వస్తుంది. అది కేవలము computer satisfaction వస్తుంది కాని selfsatisfaction రాదు. computer sacrifice చేస్తుందిగాని selfsacrifice చేయటంలేదు self realisation కాదు computer realisation జరుగుతున్నది. దీని వలన ప్రయోజనం లేదు. అన్ని ఆత్మ విశ్వాసముపైన ఆధారపడాలి. కనుక ఆత్మ విశ్వాసము మానవునకు అత్యవసరమైనది..